క్లుప్తంగా

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళం



మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న నాగమణి

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో తలపెట్టిన మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. గ్రామానికి చెందిన పాలమరశెట్టి శివ వెంకట నరసింహ జ్ఞాపకార్థం నాగమణి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.12,016 నగదును ఆలయ నిర్వాహకుడు మద్దాల వీరునాయుడుకు అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

1న ఉపకార వేతనాల జిల్లా స్థాయి నమూనా పరీక్ష

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వచ్చేనెల 1న జాతీయ ప్రతిభా ఉపకార వేతనం జిల్లా స్థాయి నమూనా పరీక్ష జరగనున్నట్టు నిర్వాహకుడు శిష్టా తమ్మిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 8, 9 గంటలకు బ్యాచ్‌ల వారీగా ఈ పరీక్ష జరుగుతుందన్నారు. అదే రోజు మూల్యాంకనం నిర్వహించి 180 మార్కులకు 110 మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

8న మాలల సింహ గర్జన



కోటవురట్లలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

కోటవురట్ల: సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో వచ్చేనెల 8న జరగనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని నర్సీపట్నం డివిజన్ మాల మహానాడు కన్వీనర్ చిట్ల చలపతి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉత్తరాంధ్ర మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా కొత్త చట్టాలు చేయడం విరుద్ధమన్నారు. దళితుల ఐక్యతను దెబ్బతీసే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం మండలంలోని దళిత నాయకులను కలుసుకుని మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎస్.నూకరాజు, ఎం.గణేష్, జి.సహదేవుడు, ఎస్.వరహాలు, బి.నూకరాజు, ఎస్.నూకరాజు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వహణతో పెరిగిన అఘాయిత్యాలు

అనకాపల్లి: రాష్ట్రంలో విచ్చల విడిగా మద్యం బెల్టు దుకాణాలు పెట్టి అమ్మకాలు జరపడంతో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా సహాయ కార్యదర్శులు రావి లక్ష్మి, గంటా సుభాషిణి అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా మద్యం పాలసీ తీసుకువచ్చిందని ఆరోపించారు. దీంతో వీధి వీధికి, గ్రామ గ్రామాన మద్యం అమ్మకాలు సాగడంతో మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. విశాఖలో లా విద్యార్థిపై నలుగురు లైంగిక దాడికి పాల్పడ్డారని, ఇలాంటి సంఘటనలు అనకాపల్లి జిల్లాలో జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతుందని వారు ఆరోపించారు. మద్యం నిషేధానికి దశల వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు.

శారదానగర్‌లో మద్యం దుకాణం తొలగించాలి

తుమ్మపాల: కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ప్రజా సంక్షేమం దృష్ట్యా తక్షణం తొలగించాలని శారదా సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, మహాత్మునికి వినతి పత్రం సమర్పించారు. శారదానగర్‌లో మద్యం దుకాణాన్ని నెలకొల్పరాదంటూ పంచాయతీ ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. తక్షణమే మద్యం దుకాణాన్ని వేరొక ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. వార్డు సభ్యుడు తాడి శ్రీనివాస్ చక్రవర్తి, ఆడారి శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శీతాకాలంలో వెచ్చని నేస్తాలు

- రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్
- యలమంచిలిలో ప్రత్యేక దుకాణాల ఏర్పాటు



ప్రధాన రహదారి పక్కన ఉన్ని దుస్తుల దుకాణాలు

యలమంచిలి రూరల్: చలిపులి చంపుతోంది. బారెడు పొద్దెక్కినా.. మంచంపై నుంచి దిగేందుకు మనసొప్పని పరిస్థితి. వెచ్చని రగ్గులో ముసుగు తన్ని నిద్రిస్తే.. ఆ సుఖమే వేరు. ఇలాంటి శీతాకాలంలో తప్పనిసరి ప్రయాణాలు, రోజువారీ విధులకు ఉదయాన్నే ఇళ్ల నుంచి బయలుదేరే వారి పరిస్థితి ఇబ్బందే కదా. ఆ ఇబ్బందుల్ని తప్పించేందుకు చలి నేస్తాలు.. యలమంచిలి పట్టణానికి చేరుకున్నాయి. మధ్యప్రదేశ్, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వ్యాపారులు వివిధ రకాల ఉన్ని దుస్తులు ఇక్కడకు తెచ్చి ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండటంతో ఉన్ని దుస్తుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీపావళి నుంచి సాయంకాలం ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఇప్పటికే రాత్రి పూట 18 డిగ్రీల కంటే తక్కువకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలంతా ఎండ ఉన్నప్పటికీ, సాయంత్రానికి వాతావరణం బాగా చల్లబడుతోంది. ఈ నేపథ్యంలో చలి నుంచి ఉపశమనం పొందడానికి యలమంచిలి పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు ఉన్ని దుస్తుల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్‌ను అనుసరిస్తూ మహిళలు, పిల్లల కోసం వెరైటీ డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. జర్కిన్‌లు, మఫ్లర్‌లు, క్యాప్‌లు, బ్లాంకెట్‌ల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఏటా వచ్చే సాధారణ స్వెట్టర్లపై ప్రజల్లో అంతగా ఆసక్తి ఉండటం లేదు. దీంతో మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త డిజైన్లతో స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ప్‌లు, మాస్కులు, జర్కిన్లు, టూ ఇన్ వన్‌గా ఉపయోగపడే జర్కిన్లు, చేతి గ్లోవ్స్, సాక్స్‌లు, రగ్గులు, కార్పెట్లు, బెడ్ షీట్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.



మహిళల కోసం అందుబాటులో ఉన్న ప్రత్యేక స్వెటర్లు

అందుబాటు ధరల్లోనే..

పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయానికి ఎదురుగా రెండు, ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ కార్యాలయానికి ఎదురుగా ఉన్ని దుస్తుల అమ్మకాల కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యాపారులు ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేశారు. పిల్లలకు సంబంధించిన స్వెట్టర్లు రూ.200 నుంచి రూ.700 వరకు, క్యాప్‌లు రూ.60 నుంచి రూ.250 వరకు పలు రకాల డిజైన్లలో లభిస్తున్నాయి. ఆరేళ్ల నుంచి పదేళ్లలోపు పిల్లలకు సంబంధించిన స్వెట్టర్లు రూ.350 నుంచి రూ.1200 వరకు లభిస్తుండగా, పదేళ్లకు పైబడిన వారి స్వెట్టర్లు రూ.350 నుంచి రూ.1500 వరకు అందుబాటులో ఉన్నాయి. పెద్దలకు సంబంధించిన స్వెట్టర్లు రూ.500 నుంచి రూ.2000 వరకు ఉండగా, జర్కిన్లు డిజైన్లు, క్వాలిటీ బట్టి రూ.600 నుంచి రూ.2 వేల వరకు లభిస్తున్నాయి. మఫ్లర్‌లు రూ.70 నుంచి రూ.150 వరకు, మంకీ క్యాపులు రూ.80 నుంచి రూ.200 వరకు, శాలువాలు రూ.150 నుంచి రూ.250 వరకు, ఉన్ని దెద్దర్లు రూ.130 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్నారు.

చలిలో తిరిగేటప్పుడు రక్షణ తప్పనిసరి

చలిగాలి నుంచి రక్షణ పొందాలంటే కచ్చితంగా ఉన్ని దుస్తులు ధరించాల్సిందే. శరీరంలోని వేడి బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు వేసుకోక తప్పదు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాత్రి, తెల్లవారుజామున రోడ్లపై ఎటువంటి రక్షణ లేకుండా తిరిగితే జలుబు, దగ్గు వాధులకు గురవుతారని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో కొంత మంది ఉన్ని దుస్తులు ధరించి నిద్రపోతారు. అది అంత మంచిది కాదని డాక్టర్లు సూచిస్తున్నారు. శీతాకాలంలో చలిలో ఎక్కువగా తిరగడం అంత మంచిది కాదని చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో చలి గాలిలో తిరిగే సమయంలో ఉన్ని స్వెట్టర్లు ధరించాలి. చెవుల్లోకి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మూడు నెలల పాటు విక్రయాలు



ప్రతి ఏటా మూడు నెలలకు పైగా ఇక్కడ ఉన్ని దుస్తులను అమ్ముతూ ఉపాధి పొందుతున్నాం. నవంబరు రెండో వారం నుంచి అమ్మకాలు ప్రారంభించాం. చలి తీవ్రత పెరుగుతుండడంతో గిరాకీ ఉంటోంది. యలమంచిలి పట్టణ వాసుల నుంచి ప్రోత్సాహం లభిస్తోంది. హోల్ సేల్ ధరలకే అన్ని రకాల డిజైన్ల ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నాం.

– సోనూ బంజారా, ఉజ్జయిని, మధ్యప్రదేశ్

ఆన్‌లైన్ షాపింగ్‌తో తగ్గిన విక్రయాలు



కుటుంబం గడవాలంటే ఉన్ని దుస్తుల అమ్మకాలే మాకు ఆధారం. ఆన్‌లైన్ షాపింగ్‌తో ఈ ఏడాది మా వ్యాపారాలకు గిరాకీ తగ్గుతోంది. ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉండటంతో ఆన్‌లైన్ ధరలతో మా వద్ద సరకు పోల్చుకుంటున్నారు. నాణ్యత తదితర అంశాలు పట్టించుకోవడం లేదు. దీంతో మాకు కొంత మేర అమ్మకాలు తగ్గుతున్నాయి. మా వద్ద లభిస్తున్న ఉన్ని దుస్తుల నాణ్యతను పరిగణనలోకి తీసుకోవాలి.

– అనిల్ బంజారా, వ్యాపారి, మధ్యప్రదేశ్

అందుబాటులో వెరైటీ డిజైన్లు



పలు ప్రాంతాల నుంచి యలమంచిలికి తెచ్చిన వెరైటీ డిజైన్లు, మోడళ్లలో ఉన్న స్వెట్టర్లు, మంకీ క్యాపులు, రగ్గులు బాగున్నాయి. కాలేజీ విద్యార్థులు, స్కూలు పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా పలు రకాల డిజైన్లు ఉన్నాయి. ఏది చూసినా కొనాలనిపించేలా ఉన్నాయి. స్వెట్టర్ కొన్నా. ధర కూడా రీజనబుల్‌గానే అనిపించింది.

– షేక్ ఆషియా, యలమంచిలి

నెల్లిపూడిలో సాయినామ సంకీర్తన



సాయి సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో నెల్లిపూడిలో ఆదివారం సాయి నామ సంకీర్తన జరిగింది. ఉదయం గ్రామానికి చెందిన సాయి భక్తులంతా వీధుల్లో షిరిడీ సాయిబాబా చిత్రపటాన్ని పట్టుకుని సాయి సంకీర్తనలు పాడుతూ వీధుల్లో తిరిగారు. నెల్లిపూడిలో సాయిసేవక్ దీక్షలు చేపట్టిన భక్తులతో ఈ కార్యక్రమం ఘనంగా సాగింది. నెల్లిపూడి సాయి ఆశ్రమంలో సాయిబాబా వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖపట్నం నుంచి వచ్చిన సాయి గురూజీ సాంబశివరావు.. సాయి బాబా మహిమలు, వ్రతాల విశిష్టతలను వివరించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది సాయి భక్తులు పాల్గొన్నారు.

పుణ్య క్షేత్రాలకు శివ భక్తులు



శివభక్తులకు ఇరుముడులు వేస్తున్న గురుస్వాములు

మునగపాక: మాలలు ధరించిన పలువురు శివభక్తులు ఆదివారం పుణ్య క్షేత్రాలకు పయనమయ్యారు. కార్తీక మాసంలో మాలలు ధరించిన పలువురు శివభక్తులు దీక్ష అనంతరం మొక్కులు చెల్లించుకునేందుకు తరలివెళ్లారు. మునగపాకలోని సాంబశివుని ఆలయ సన్నిధిలోనూ, మునగపాక బీసీ కాలనీలో వినాయక పీఠం ఆధ్వర్యంలో శివమాలలు ధరించిన భక్తులు ఇరుముడులు కట్టి ఆలయాలకు వెళ్లారు. గురుస్వాములు జోగారావు, మహేష్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పుణ్య క్షేత్రాలైన శ్రీశైలం, పుణ్యగిరి, తదితర ప్రాంతాలకు పయనమయ్యారు.

స్మార్టుమీటర్లు వద్దే వద్దు..

కోటవురట్ల: రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.36 వేల కోట్ల భారాన్ని మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ దుయ్యబట్టారు. కొడవటిపూడిలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదల బతుకులను వీధిన పడేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడు పెనుభారం వేయడమే కాకుండా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ముందుగానే రీచార్జ్ చేసుకోవాలని, ఇది పేదలను అంధకారంలోకి నెట్టేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.డేవిడ్‌రాజ్, కన్నయ్య, సూరిబాబు, రమణ, తాతబ్బాయి, తల్లిబాబు, రాజారత్నం పాల్గొన్నారు.



కొడవటిపూడిలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్న సీపీఎం నాయకులు

ఉత్సాహంగా వన సమారాధనలు



ఆడారి సంఘం అధ్యక్షుడు దానకర్ణను సత్కరిస్తున్న సభ్యులు



సహపంక్తి భోజనాలు చేస్తున్న వెలగా కుటుంబ సభ్యులు

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం పిక్నిక్‌ల సందడి నెలకొంది. పలు సంఘాల కుటుంబ సభ్యులంతా ఉదయం నుంచి పిక్నిక్ వేడుకలను జరుపుకొన్నారు. కార్తీక మాసం కావడంతో మునగపాకలోని ఆడారి, వెలగా, మళ్ల, టెక్కలి తదితర కుటుంబాలకు చెందిన సభ్యులంతా వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న స్థలంలో ఆడారి కుటుంబ సభ్యుల కార్తీకవన సమారాధన పేరిట సమావేశమై పెద్దలను సత్కరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి దానకర్ణ, ఆడారి దేవకిలతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. చెరువు కాలువ సంఘం పరిధిలోని వెలగా కుటుంబ సభ్యులంతా సహపంక్తి భోజనాలు చేశారు. టెక్కలి కుటుంబ సభ్యులంతా స్థానిక పరదేశమ్మతల్లి గుడి ప్రాంగణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం



కె.జె.పురంలో గౌరీ పరమేశ్వరుల ఉరేగింపు



ఊరేగింపులో మహిళల కోలాటం



ఎ.కొత్తపల్లిలో గౌరీ పరమేశ్వర్ల ఊరేగింపులో పాల్గొన్న చింతల సత్య వెంకటరమణ తదితరులు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం గ్రామంలో గౌరీ పరమేశ్వర్ల ఉత్సవాలు శనివారం అర్ధరాత్రితో ముగిసాయి. ఈ నెల 5 వ తేదిన గౌరీ పరమేశ్వర్లను గ్రామంలో శాలిపేట చావిడిలో ప్రతిష్ఠించారు. 19 రోజుల పాటు పూజలు అందుకున్న గౌరీ పరమేశ్వర్లను శనివారం అర్ధరాత్రి ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పుర వీధుల్లో గౌరీ పరమేశ్వర్లను ఉరేగించారు. మహిళలు కోలాటం అలరించింది. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవంలో పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో గౌరీ పరమేశ్వర్ల నిమజ్జన మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాటం, తప్పెటగుళ్లు, తీన్‌మార్ వాయిద్యాలు నడుమ రామలయం నుంచి ప్రారంభమై గ్రామ పుర వీధుల మీదుగా గౌరీ పరమేశ్వర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. ప్రతి ఇంటా గౌరీ పరమేశ్వర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ సరువునాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : చౌడువాడలో సతకంపట్టు, గవరపేటలలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరుల అనుపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో గల ప్రధాన వీధుల్లో గౌరీపరమేశ్వరుల ఊరేగింపు, మహిళా కోలాటాల నడుమ అనుపు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



చౌడువాడలో గౌరీపరమేశ్వరులకు పూజలు

వరి కోతలకు సన్నాహాలు



దార్లపూడిలో ముందుగా పండిన వరిపంట

ఎస్.రాయవరం: మండలంలో ముందుగా పండిన వరి కోతలకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. చాలా చోట్ల ఖరీఫ్ నాట్లు ఆలస్యమైనప్పటికి మోటార్లు, వరహా నది కాలువలకు ఆనుకుని ఉన్న పంట పొలాల్లో సకాలంతో నాట్లు పడడంతో ముందుగా పండాయి. అలా పండిన పంటలు మరికొద్ది రోజులు కోతకు వస్తాయని రైతులు చెబుతున్నారు. దార్లపూడి, చినగమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, భీమవరం, పెదఉప్పలం, గుర్రాజుపేట తదితర గ్రామాల్లో వరి ముందుగా పండిది. మండలంలో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు.

మునగపాక మండలం అభివృద్ధికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మునగపాక మండలాన్ని ప్రగతి పథంలో పయనించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రోడ్డును 100 అడుగులకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే బాధితులను గుర్తించడంతో పాటు మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రహదారులు, కాలువల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు



అచ్యుతాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం(మునగపాక): కార్మిక, కర్షక ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న అనకాపల్లిలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం అచ్యుతాపురం నుంచి సీఐటీయూ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ అచ్యుతాపురం జంక్షన్ నుంచి రామన్నపాలెం, వెదురువాడ, ఎంఆర్‌వో కార్యాలయం మీదుగా ఎస్ఈజెడ్ రోడ్డు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోమునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు రాజన్న, సత్తిబాబు, కార్మికులు పెంటయ్య, సన్యాసిరావు, సత్యనారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యలమంచిలి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం నిరంకుశ విధానాలతో పేద వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐక్య పోరాటం ద్వారా హక్కులు సాధించుకోవడానికే ప్రదర్శన నిర్వహిస్తున్నామని, దీనిని అన్ని కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నాయకులు విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి కష్టజీవుల పొట్ట కొడుతోందని విమర్శించారు. రైతులు చెమటోడ్చి సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకుండా కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, శశికళ, జానకి, వరలక్ష్మి, అప్పలరాజు, లక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.



యలమంచిలిలో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

భూగర్భ శివాలయంలో అభిషేకాలకు ఏర్పాట్లు

నాతవరం : కార్తీకమాసం ఆఖరు సోమవారం కావడంతో చిక్కుడుపాలెంలో గల శ్రీశివ శక్తి క్షేత్రం శివాలయంలో స్వహస్తాలతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెంలో భూగర్భంలో శివాలయం నిర్మించారు. ఇక్కడ అన్ని రకాలు శివలింగాలు ఏర్పాటు చేశారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు స్వహస్తాలతో శివలింగాలకు అభిషేకాలు పూజలు చేసేందుకు వేదపండితులు శ్రీ సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా వెదురుపల్లి గ్రామంలో రేటమ్మ కొండపై వెలసిన శివ పార్వతుల ఆలయంలో కూడా సోమవారం పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



భూగర్భ శివాలయంలో శివలింగాలు

బొజ్జన్న కొండకు సందర్శకుల తాకిడి



బొజ్జన్నకొండకు తరలివచ్చిన సందర్శకులు

తుమ్మపాల: కార్తీక వన సమారాధనలో భాగంగా ఆదివారం బొజ్జన్నకొండకు అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. బొజ్జన్నకొండపై గల బౌద్ధ మందిరంలో బుద్ధుని విగ్రహం, స్థూపాలకు మహిళలు దీపారాధన చేశారు. బౌద్ధరామాలు, చైత్యాలను కొండపై పరిసరాలను సందర్శించి ఆహ్లాద వాతవరణంలో రోజంతా సేదతీరారు. చుట్టూ వరి పొలాలతో పచ్చని పచ్చికబయళ్ల మధ్య ఉన్న బొజ్జన్నకొండతో పాటు లింగాల కొండను సందర్శించారు. సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. జిల్లాలో పలు పాఠశాలల విద్యార్థులు పిక్నిక్‌లకు తరలివచ్చి రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.